ప్రజా పాలనకు పెద్దపీట



ప్రసంగిస్తున్న కలెక్టర్



ఆర్మీ విన్యాసాలతో విద్యార్థులు



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో జాతీయ పతకానికి వందనం చేస్తున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

- ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణలో అభివృద్ధి
- ఆరు గ్యారెంటీల అమలుపై ప్రత్యేక దృష్టి
- యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యం
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం దక్కే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదన్నారు. ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో సరికొత్త అధ్యాయం లిఖించాలన్నది ప్రభుత్వ అభిమతమని పేర్కొన్న కలెక్టర్ సమిష్టి కృషితో ఆ లక్ష్యానికి చేరుకోగలమనే ఆకాంక్షను వెల్లడించారు. గణతంత్ర వేడుకలు శుక్రవారం నాగర్‌కర్నూల్ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా జరిగాయి. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి, ఎస్పీ వైభవ్ గైక్వాడ్, అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, సీతారామారావు, అదనపు ఎస్పీ రామేశ్వర్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉదయ్‌కుమార్ వేడుకలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగా 1947 ఆగస్టు 15న బ్రిటీష్ పాలన నుంచి విముక్తిమైన భారత ప్రజలందరూ సంపూర్ణ స్వేచ్ఛను, సమానత్వాన్ని, లౌకికత్వాన్ని, న్యాయాన్ని పూర్తి స్థాయిలో ఒక హక్కుగా పొందడం జరగిందన్నారు. అలాగే ప్రతీ పౌరుడు దేశ సేవకు, అభివృద్ధికి పాటుపడేలా భారత రాజ్యాంగం బాధ్యతలను కల్పించినట్లు తెలిపారు. ప్రజల ఉద్యమ ఆకాంక్షలు, ప్రజా సంక్షేమమే ఈ ప్రభుత్వ ప్రాధాన్యాలన్నారు. ప్రతి పౌరుడికి సంక్షేమ ఫలాలు అందించడం ప్రభుత్వ బాధ్యతగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పన, నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ముఖ్యంగా వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్‌తో పాటు రైతు భరోసా పథకం అమలు చేయడంలో భాగంగా చిన్న, సన్నకారు రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1.81 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.105 కోట్లు జమ చేశామన్నారు. జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో ప్రజావాణి నిర్వహిస్తున్నామన్నారు.



ఆకట్టుకున్న తెలకపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ప్రదర్శన

హైదరాబాదు మహాత్మ జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజావాణి పేరుతో ప్రజా సమస్యలు వినేందుకు మంత్రులు అందుబాటులో ఉంటున్నారన్నారు. ఇందులో నాగర్‌కర్నూల్ జిల్లాకు సంబంధించి 80 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, అందులో రెండు గ్యారెంటీలను ఇప్పటికే ప్రభుత్వం అమలు చేసిందన్నారు. మహాలక్ష్మి పథకంలో మహిళల అభ్యున్నతి కోసం కుటుంబంలో ఒక మహిళకు రూ.2500 రూపాయల ఆర్థిక సాయం అందించడంతో పాటు రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను ప్రభుత్వం అందించనుం దన్నారు. డిసెంబరు 9 నుంచి అమలుపరుస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా టీఎస్‌ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 15,84,812 మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యం వినియోగించుకున్నారని తెలిపారు. చేయూత పథకంలో భాగంగా పేద ప్రజల ఆరోగ్యం కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమాను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. మిగిలిన గ్యారెంటీల అమలుకు ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో అబ్దిదారుల నుంచి దరఖాస్తులను గత డిసెంబరు 28 నుంచి ఈ నెల 6 వరకు ప్రజల నుంచి 2,76,904 దరఖాస్తులు, ఇతర పథకాల కోసం 65,842 దరఖాస్తులను ప్రజల నుంచి స్వీకరించినట్లు తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయడం, రైతు భరోసా పథకంలో రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సహాయం అందజేయడం జరుగనుందన్నారు. అలాగే చేయూత పథకం ద్వారా వృద్ధాప్య పింఛన్‌ను రూ.4 వేలు నెలకు అందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి పని చేస్తున్న ప్రభుత్వ యంత్రాంగానికి, దిశ దశ నిర్దేశిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రివర్యులకు, జిల్లా మంత్రి, జడ్పీ చైర్ పర్సన్, పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు, జిల్లా ప్రజానీకానికి ఈ సందర్భంగా కలెక్టర్ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ శాఖల శకటాలు, స్టాల్స్‌లను జిల్లా ఎస్పీతో తిలకించిన అనంతరం వివిధ శాఖల అధికారులకు ప్రతిభా పురస్కారాలు కలెక్టర్ అందజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నాగర్‌కర్నూల్ టౌన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో వివిధ పాఠశాలల విద్యార్థుల నృత్యాలు అలరించారు. మొదటగా జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలను ప్రదర్శిస్తూ నృత్యం చేశారు. అచ్చంపేట ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ విద్యార్థుల ఘర్ ఘర్ తిరంగా నృత్యం చేయగా చారకొండ విశ్వశాంతి హైస్కూల్ విద్యార్థులు సరిలేరు నీకెవ్వరు సైనికుడా అనే పాటకు నృత్యంతో దేశ రక్షణలో ఆర్మీ పోరాటాలకు కళ్లకు కట్టినట్లు చూపించారు. వందేమాతర గీతంతో ఉయ్యాలవాడ జ్యోతిబా పూలే గురుకుల విద్యార్థులు నృత్య ప్రదర్శన చేయగా చివరిగా ఐనోల్ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు రేలారే నగోరో అంటూ ఆదివాసీల నృత్యాన్ని ప్రదర్శించారు. నృత్య ప్రదర్శనలో జడ్పీహెచ్ఎస్ తెలకపల్ల ప్రథమ, చారకొండ విశ్వశాంతి హైస్కూల్ ద్వితీయ, ఐనోల్ గిరిజన గురుకుల విద్యార్థులు తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులందరినీ కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు.

● ఆకట్టుకున్న శకటాలు, స్టాల్స్

గణతంత్ర దినోత్సవం సందర్భంగా అటవీశాఖ, గ్రామీణాభివృద్ధిశాఖ, వైద్యశాఖ, మిషన్ భగీరథ, పశుసంవర్ధకశాఖల ఆధ్వర్యంలో శకటాలను ప్రదర్శించారు. అటవీ, గ్రామీణ, మిషన్ భగీరథ శకటాలు ఆకట్టునేలా ప్రదర్శించి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నాయి. అలాగే వైద్య వ్యవసాయ, స్త్రీ శిశు సంక్షేమం, ఎస్సీ సంక్షేమం, గిరిజన సంక్షేమం, ఉద్యన, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్‌ను ఏర్పాటు చేసి ఆయా శాఖల ప్రగతిని సందర్శకులను వివరించారు.



గణతంత్ర వేడుకల్లో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ఉయద్‌కుమార్



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్



గణతంత్ర వేడుకల్లో ప్రదర్శిస్తున్న మిషన్ భగీరథ శకటం



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో గణతంత్ర వేడుకలకు హాజరైన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే విజయం

- రేపు పాలమూరుకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాక
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

మహబూబ్‌నగర్ (క్లాక్ టవర్), జనవరి 26: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక సీట్లను కైవసం చేసుకొని, విజయం సాధిస్తుందని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. రాష్ట్రంలో అబద్ధాలను పదేపదే ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు ఏపీ జితేందర్ రెడ్డి, పార్లమెంట్ ఇంచార్జి రామచందర్ రావులతో కలిసి ఆమె మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తెలంగాణలో ఐదు క్లస్టర్లను ఏర్పాటు చేసినట్లు జరిగిందన్నారు. అందులో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాలు కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేశారన్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఈ నెల 28న నిర్వహించనున్న సమావేశానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరవుతారని తెలిపారు. తెలంగాణలో బీజేపీ 10 నుంచి 12 పార్లమెంట్ స్థానాలను గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో రావుల రవీంద్రనాథ్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ డోకూరు పవణ్ కుమార్ రెడ్డి, కెవీఎల్ఎన్ రాజు, ఏపీ మిథున్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

ఐదు రోజులే..

- గ్రామ పంచాయతీ పాలకవర్గాలకు ముగుస్తున్న గడువు
- పెండింగ్ బిల్లులపై సర్పంచుల మల్లగుల్లాలు
- ప్రత్యేక అధికారుల పాలనకు ప్రభుత్వం సిద్ధం



పెద్దమందడి మండలం అల్వాల గ్రామ పంచాయతీ కార్యాలయం

వనపర్తి/ వనపర్తి రాజీవ్ చౌరస్తా, జనవరి 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ పాలక వర్గాలకు వారం రోజుల్లో గడువు ముగియనుంది. ప్రస్తుత సర్పంచులు ఫిబ్రవరి ఒకటవ తేదీతో మాజీలు కానున్నారు. షెడ్యూల్ ప్రకారమైతే ఇప్పటికే ఎన్నికలు జరుగుతుండాలి. కానీ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో ఎన్నికలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. గత ప్రభుత్వం పదేళ్ల కోసం తెచ్చిన రిజర్వేషన్లు, నూతన పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు తదితర అంశాలపై ఒక నిర్ణయానికి రాలేదు. దాంతో ఇప్పట్లో ఎన్నికలు జరిగే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు. ఫిబ్రవరి చివరి వారంలో లేదా మార్చి మొదటి వారంలో పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉండటంతో.. ఆ తర్వాతే పంచాయతీ ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులతోపాటు నిత్యం జరిగే పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఉండేందుకు ఫిబ్రవరి ఒకటి నుంచి ప్రత్యేక అధికారుల పాలనను అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. అయితే పంచాయతీల్లో కొద్దికాలం నుంచి పెండింగ్ బిల్లుల సమస్య తీవ్రంగా ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచే ఈ సమస్య ఉన్నప్పటికీ.. అప్పట్లో సర్పంచులతో కూడా తమ గ్రామంలో ఎలాంటి పెండింగ్ బిల్లులు లేవని ప్రభుత్వం చెప్పించింది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో తమ పెండింగ్ బిల్లులపై సర్పంచులు గళమెత్తుతున్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు. ప్రస్తుత పాలకవర్గాలు ఏర్పడిన కొత్తలో ఎనిమిది నెలలపాటు సర్పంచులకు చెక్ పవర్ ఇవ్వలేదు. తర్వాత ఇచ్చినా ఉప సర్పంచులతో కలిపి ఇవ్వడంతో అనేక పంచాయతీల్లో ఇద్దరి మధ్యలో గొడవలు జరిగాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే తమ పదవీ కాలం ముగుస్తుండటంతో సర్పంచులు ఆందోళన చెందుతున్నారు.

చట్టంలో లేని పర్సన్ ఇన్‌చార్జిలు..

గత ప్రభుత్వం పాత పంచాయతీరాజ్ చట్టాన్ని రద్దు చేసి 2018లో నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఇందులో అనేక కొత్త అంశాలను పేర్కొన్నారు. పంచాయతీల రిజర్వేషన్ 10 ఏళ్లపాటు ఒకే విధంగా ఉండటం, విధి నిర్వహణలో తప్పు చేస్తే సర్పంచును సస్పెండ్ చేయడం, అవసరమైతే టర్మినేట్ చేయడం వంటివి ప్రధానమైనవిగా చెప్పొచ్చు. ఈ చట్టంలో భాగంగా అనేకమంది సర్పంచులు కక్షసాధింపు చర్యలతోనే.. ఇంకో విధంగానో సస్పెండ్ అయ్యారు. కొందరు ఉద్వాసనకు కూడా గురయ్యారు. కొందరు కోర్టు మెట్లు ఎక్కి.. తిరిగి సర్పంచ్ పీఠం దక్కించుకున్నారు. అయితే గతంలో పంచాయతీ పాలకవర్గాలకు గడువు ముగిస్తే రెండు విధాలుగా పాలన సాగించే అవకాశం ఉండేది. అందులో ఒకటి అప్పటికే ఉన్న పాలకవర్గం సర్పంచుకు పర్సన్ ఇన్‌చార్జిగా ఇవ్వడం లేదా ప్రత్యేక అధికారుల పాలన విధించడం వంటి చర్యలు చేపట్టేవారు. కానీ 2018లో అప్పటి ప్రభుత్వం తెచ్చిన నూతన పంచాయితీరాజ్ చట్టంలో.. పంచాయతీలకు గడువు ముగిసిన పక్షంలో పర్సన్ ఇన్‌చార్జిలకు బాధ్యతలు ఇవ్వడానికి కుదరదని, కేవలం ప్రత్యేక అధికారుల పాలన మాత్రమే చేయాలని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న సర్పంచులకు పర్సన్ ఇన్‌చార్జిలు ఇచ్చే అవకాశం ఎట్టి పరిస్థితుల్లో లేదని చెప్పొచ్చు. ప్రస్తుత సర్పంచులు మాత్రం తమకు ఎనిమిది నెలల పాటు చెక్‌పవర్ లేక ఇబ్బందులు పడ్డామని, ఆ మేరకు ఇప్పుడు కొనసాగింపు లేదా పర్సన్ ఇన్‌చార్జిలుగా అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఒకవేళ సర్పంచులు కోరినట్లు చేయాలంటే అసెంబ్లీలో చట్ట సవరణ చేసి ఉండాలి. లేదా ప్రత్యేక ఆర్డినెన్స్ తేవాలి. కానీ ప్రస్తుత పంచాయతీల్లో చాలామంది బీఆర్ఎస్‌కు చెందిన సర్పంచులే ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో చట్టసవరణ లేదా ఆర్డినెన్స్‌కు ఎట్టి పరిస్థితుల్లో అవకాశం లేదు.

1719 పంచాయతీలు..

ఉమ్మడి పాలమూరులో ఐదు జిల్లాలు ఉండగా.. అన్నింటిలో కలిపి 1,719 పంచాయతీలు ఉన్నాయి. వీటికి 2019 జనవరిలో మూడు విడతలుగా ఎన్నికలు జరిగాయి. మూడు దశల ఎన్నికలు ముగిసిన తర్వాత 2019 ఫిబ్రవరి ఒకటిన పంచాయతీల పాలక వర్గాలు కొలువుదీరాయి. ఈ ఫిబ్రవరి ఒకటితో ఆ గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణ జోలికి పోలేదు. దీనికి కారణం ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం పంచాయతీలను కేటాయిస్తామని హామీ ఇచ్చింది. అయితే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం 2019లో కేటాయించిన రిజర్వేషన్లు మరో ఐదేళ్లపాటు కొనసాగించాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్ పార్టీ హామీ మేరకు రిజర్వేషన్లు మార్చాలంటే చట్ట సవరణ చేయాల్సిందే. అలాగే పార్టీ ఇచ్చిన హామీల్లో అతి ముఖ్యమైనవి ఆరు గ్యారంటీలు కూడా. ఇందులో మెజారిటీ అమల్లోకి తెచ్చిన తర్వాతనే పంచాయతీ ఎన్నికలకు వెళ్తే ఎక్కువ స్థానాలు గెలుచుకోవచ్చనే అభిప్రాయం కూడా పార్టీలో ఉంది. అయితే రానున్న పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో పంచాయతీ ఎన్నికలపై శ్రద్ధ పెట్టడం లేదని కూడా తెలుస్తోంది. ఇదిలా ఉంటే పంచాయతీల్లో ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావడం ప్రారంభమైంది. ఇతర పార్టీల నుంచి పెద్దగా చేరికలను ప్రోత్సహించకపోవడంతో ఉన్న కార్యకర్తల్లోనే ఆశావహులు తాము పోటీలో ఉంటామని ప్రకటిస్తున్నారు.

కొద్దిరోజులు అవకాశం ఇవ్వాలి



మొదట్లో ఎనిమిది నెలల కాలం సర్పంచులకు చెక్ పవర్ ఇవ్వలేదు. ఆ తర్వాత రెండేళ్లు కరోనా పేరుతో అన్ని రకాల అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. వడ్డీలకు అప్పులు తెచ్చి చేసిన బిల్లులు కూడా ఇంతవరకు మంజూరు కాలేదు. ఉన్నవారినే మరికొంత కాలం సర్పంచులుగా కొనసాగించాలి. బకాయి ఉన్న ప్రభుత్వం బిల్లులన్నీ చెల్లించి, సర్పంచులను ఆదుకోవాలి.

- నంది కౌసల్యారెడ్డి, సర్పంచు, కొప్పునూరు

పెండింగ్ బిల్లులను చెల్లించాలి



పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించాలి. బిల్లులు రాక ఇప్పటికే చాలామంది సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేశాం. ఇప్పటికే రూ.లక్షల్లో పెండింగ్ బిల్లులు ఉన్నాయి. స్పెషల్ ఆఫీసర్ల పాలనపై ప్రభుత్వం పునరాలోచించాలి. ఉన్న సర్పంచుల పదవీ కాలాన్నే కొనసాగించడంతోపాటు నిధులు మంజూరు చేయాలి.

- రమేష్, సర్పంచు, చెన్నారం

బుర్రవీణ కళకు జీవం పోస్తున్న కొండప్ప

- అత్యున్నత పురస్కారం పద్మశ్రీ రావడంపై ఆనందం
- ఈ కళ ద్వారానే తాతల కాలం నుంచి జీవనోపాధి
- తనతోనే అంతరించి పోకుండా మనవడికి శిక్షణ



బుర్ర వీణతో కళాకారుడు కొండప్ప

నారాయణపేట టౌన్, జనవరి 26: అంతరించిపోతున్న బుర్ర వీణ వాయిద్య కళకు నారాయణపేట జిల్లా దామరగిద్ద గ్రామానికి చెందిన దాసరి కొండప్ప జీవం పోస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం అత్యున్నత పురస్కారం పద్మశ్రీకి ఎంపిక చేయడంపై జిల్లా వ్యాప్తంగా హర్షం వ్యక్తమౌతోంది. ఈ సందర్భంగా కొండప్ప సంతోషం వ్యక్తం చేశారు. తాతల కాలం నుంచి జీవనోపాధి కోసం ఈ కళను ఎంచుకున్నట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా చనిపోయినప్పుడు, శుభ కార్యాలు ఉన్నప్పుడు బుర్రవీణ వాయిస్తూ తత్వాలు, బుర్రకథ చెబుతూ వారిచ్చే డబ్బులతో జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. ఈ బుర్రవీణ వాయిద్యంపై ఎవరికీ అవగాహన లేదని, ఇలాంటి కళను కేంద్ర ప్రభుత్వం గుర్తించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కళ అంతరించి పోకుండా ఉండేందుకు తన మనుమడు మనోజ్‌కు శిక్షణ ఇస్తున్నట్లు కొండన్న తెలిపారు. గతంలో పలు టీవీ ఛానళ్ల వారు తన బుర్రవీణ వాయిద్య కళను ప్రసారం చేశారని, బలగం సినిమాలో ఓ పాటను కూడా పాడానని అన్నారు. అయినా పెద్దగా గుర్తింపు రాలేదన్నారు.

గణతంత్ర వేడుకల్లో సన్మానం

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత దామరగిద్దకు చెందిన కొండప్పను కలెక్టర్ శ్రీహర్ష, జడ్పీ చైర్‌పర్సన్ వనజ, అదనపు కలెక్టర్లు మయాంక్ మిట్టల్, అశోక్ కుమార్, ఎస్పీ యోగేష్ గౌతమ్, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డిలు పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొండప్ప తన బుర్రవీణ వాయిస్తూ, బలగం సినిమాలోని అయ్యో శివుడా ఏమాయే అనే పాటను పాడి ఆకట్టుకున్నారు. బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, రాష్ట్ర కోశాధికారి శాంత కుమార్ కొండప్పను సన్మానించారు. కొండప్ప కళను గుర్తించి, పద్మశ్రీ పురస్కారం కోసం నెల రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు శాంతకుమార్ తెలిపారు. ఆయనకు పద్మశ్రీ అవార్డు సాధించి ఉమ్మడి జిల్లాకే గర్వకారణమని అన్నారు.

జోగుళాంబ జోన్‌లో
21 మంది ఎస్సైల బదిలీ

» ఉత్తర్వులు జారీ చేసిన డీఐజీ

మహబూబ్‌నగర్, జనవరి 26 : జోగుళాంబ గద్వాల జోన్ పరిధిలో 21 మంది ఎస్సైలకు స్థానభ్రంశం జరిగింది. ఈ మేరకు డీఐజీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం మారిన తరువాత తొలిసారి ఉమ్మడి జిల్లాలో పెద్దఎత్తున పోలీస్ బదిలీలు జరగడం విశేషం.

ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డిని జడ్చర్ల డీటీసీ నుంచి మక్తల్‌కు బదిలీ చేయగా, జి.విజయ్‌కుమార్ వీఆర్ నారాయణపేట నుంచి మహబూబ్‌నగర్ రూరల్‌కు, కనుగుల వెంకటేశ్ దేవరకద్ర నుంచి హన్వాడకు, కేత్లావత్ రవిని హన్వాడ నుంచి మహబూబ్‌నగర్ వీఆర్‌కు, జి.రాఘవేందర్ జడ్చర్ల నుంచి కోయిలకొండకు, పి.విజయ్‌భాస్కర్ కోయిలకొండ నుంచి మహబూబ్‌నగర్ వీఆర్‌కు, ఏ.వెంకటేశ్వర్లు మహబూబ్‌నగర్ రూరల్ నుంచి నారాయణపేట టౌన్‌కు, వి.రమేశ్ మహబూబ్‌నగర్ వీఆర్ నుంచి ధన్వాడకు, పి.రమేశ్ ధన్వాడ నుంచి మహబూబ్‌నగర్ వీఆర్‌కు బదిలీ చేయగా, ఏ.పర్వతాలు మక్తల్ నుంచి నారాయణపేట వీఆర్‌కు, కె.గోవర్ధన్ అచ్చంపేట నుంచి నారాయణపేట రూరల్‌కు, కె.మురళి మదనాపూర్ నుంచి మరికల్‌కు, సి.హరిప్రసాద్‌రెడ్డిని మరికల్ నుంచి వనపర్తి వీఆర్‌కు, ఏ.వసంత డీఎస్‌బీ నారాయణపేట నుంచి దామరగిద్దకు, పి.శ్రీనివాసరావు దామరగిద్ద నుంచి నారాయణపేట వీఆర్‌కు, వి.సతీష్ నాగర్‌కర్నూల్ వీఆర్ నుంచి పెద్దకొత్తపల్లికి, ఈ.రామన్‌గౌడ్ నాగర్‌కర్నూల్ వీఆర్ నుంచి పెంట్లవెల్లికి, పి.రాజు పెద్దకొత్తపల్లి నుంచి నారాయణపేట వీఆర్‌కు, బి.సతీష్ పెంట్లవెల్లి నుంచి వనపర్తి వీఆర్‌కు, జి.గోకారి ఊట్కూర్ నుంచి చిన్నంబావికి, కృష్ణటబుల్ రెడ్డి చిన్నంబావి నుంచి వనపర్తి వీఆర్‌కు బదిలీ అయ్యారు.

స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగం

» 17 మంది జీహెచ్ఎంలపై చర్యలు ఏమైనట్లు..?

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 26: గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీల్లో నిబంధనలకు విరుద్ధంగా స్పౌజ్ పాయింట్లు ఉపయోగించుకున్న పలువురు జీహెచ్ఎంలపై చర్యలు తీసుకునేందుకు విద్యాశాఖ రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. గత సెప్టెంబరులో జరిగిన బదిలీల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 మంది జీహెచ్ఎంలు నిబంధనలకు తూట్లు పొడుస్తూ ఆన్‌లైన్ బదిలీల దరఖాస్తు చేసుకునే సమయంలో తప్పుడు సమాచారం ఇచ్చి వారికనుగుణంగా ప్లేస్‌లు తీసుకున్న పలువురి జీహెచ్ఎంలపై గతంలో 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు వచ్చాయి. దీనిపై అప్పట్లో స్పందించిన ఆర్జేడీ గత నెలలో జిల్లా విద్యాశాఖ అధికారులను పూర్తి వివరాలు ఇవ్వాలని వివరణ కోరిన విషయం తెలిసిందే. ఆ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు పూర్తి వివరాలు సేకరించి సదరు జీహెచ్ఎంలు ఎప్పుడెప్పుడు స్పౌజ్ పాయింట్లు వాడుకున్నారు, వాడుకుంటే నిబంధనల మేరకే వాడుకున్నారా..? అన్న విషయాలను సేకరించి వివరాలను ఆర్జేడీకి ఈనెల మొదటివారంలోనే పంపించినట్లు విద్యాశాఖ అధికారుల తెలిపారు.

దీనిపై ఆర్జేడీ చర్యలు తీసుకోపోవడంపై పలు విమర్శలకు తావిస్తోంది. దీనిపై పలుమార్లు ఆర్జేడీని కలిసిన సంబంధిత జీహెచ్ఎంలపై చర్యలు తీసుకోవాలని విన్నవించినా ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని టీపీసీసీ అధికార ప్రతినిధి, తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థాపకుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. దీనిపై విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన పేర్కొన్నారు.

బొటానికల్ గార్డెన్‌ను సందర్శించిన పీయూ రిజిస్ట్రార్

జడ్చర్ల, జనవరి 26 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ గిరిజా మంగతాయారు శుక్రవారం సందర్శించారు. బొటానికల్ గార్డెన్ ఏర్పాటు చేసిన తీరు, అభివృద్ధి చేస్తున్న పద్ధతిని ఈ సందర్భంగా తెలుసుకుని, బొటానికల్ గార్డెన్ కోఆర్డినేటర్ డాక్టర్ సదాశివయ్యను అభినందించారు. గార్డెన్‌లో అంతరించిపోతున్న మొక్కలు, ఔషధమొక్కలు, అలంకరణ మొక్కలు తదితర వాటి గురించి సదాశివయ్య వివరించారు. బొటానికల్ గార్డెన్‌ను సందర్శించిన వారిలో స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ మధుసూధన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ ఉన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అప్పియచిన్నమ్మ, అధ్యాపకులు సుభాషిణి, పరిశోధక విద్యార్థులు రమాదేవి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులున్నారు.



జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను సందర్శించిన పీయు రిజిస్ట్రార్ గిరిజా మంగతాయారు

కానిస్టేబుల్ కుటుంబానికి తోటి స్నేహితుల ఆర్థిక సహాయం

వనపర్తి రూరల్, జనవరి 26 : వనపర్తి పట్టణ పరిధిలోని శ్రీనివాసపూర్‌లో కానిస్టేబుల్ కుటుంబానికి భార్య అనసూయకు తోటి స్నేహితులు శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. వనపర్తి జిల్లా పెద్దమందడి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న బాలరాజు కొన్నిరోజుల క్రితం మృతి చెందాడు. బాలరాజు తోటి స్నేహితులు రూ.10 లక్షల 90వేలు పిల్లల పేర్లపై డిపాజిట్ చేసి బాలరాజు కుటుంబానికి అండగా నిలిచారు. బాలరాజు కుటుంబానికి అండగా ఉన్నామన్న భరోసా కల్పించాలనే ఉద్దేశంతో మానవత్వం చూపామని తోటి స్నేహితులు తెలిపారు. భవిష్యత్‌లో మరే సహాయమైనా చేయడానికి సిద్ధం అని మృతుడు కుటుంబానికి భరోసా ఇచ్చారు. తోటి స్నేహితులు నాగరాజు, వంశీ, రవి, ప్రసాద్, ఆంజనేయులు, సహదేవుడు, నరసింహ తదితరులున్నారు.



మృతి చెందిన బాలరాజు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న తోటి స్నేహితులు

రెండవ ఏఎన్ఎంలకు సమాన వేతనం ఇవ్వాలి

» ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బీఎస్.జయపాల్

నవాబ్‌పేట, జనవరి 26 : వైద్యశాఖలో పని చేస్తున్న రెండవ ఏఎన్ఎంలను ప్రభుత్వం గుర్తించి వారికి పనికి తగిన వేతనం చెల్లించేలా తమ వంతు కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బీఎస్.జయపాల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మలమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి శరభలింగంతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా ఐఎన్‌టీయూసీ సంఘం వైద్య శాఖ ఉద్యోగుల పక్షాన నిరంతరం పోరాడుతుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలులో తమ పాత్ర కీలకమన్నారు. సమావేశంలో ప్రమోద్‌కుమార్, వినోదిని, శ్రీదేవి, మంజుల, బాలమ్మ, కేజీయా, జ్యోతి, వసుంధర, రజిత, రామేశ్వరి, బాలేశ్వరి, పుష్పలత, ఇందిర, ఆసీఫబేగం, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్.జయపాల్

శివ దీక్షకు వేళాయెరా..

» ఉమామహేశ్వరంలో శివస్వాముల సందడి
» మాలలు ధరించిన భక్తులు

అచ్చంపేట, జనవరి 26 : ప్రతీ సంవత్సరం మహాశివరాత్రిని పురస్కరించుకొని 41రోజులు ముందుగా శివభక్తులు శివదీక్ష తీసుకొని స్వామిని కొలుస్తు ఉంటారు. ఈ ఏడాది మార్చి ఎనిమిదో తేదీన మహాశివరాత్రి పర్వదినం కావడంతో శివభక్తులు మాలధారణ కోసం జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీఉమామహేశ్వర క్షేత్రానికి తరలి వస్తున్నారు. శుక్రవారం వరకు దాదాపు 300 మందికి పైగా భక్తులు శివమాలధారణ తీసుకున్నారు. ప్రధాన అర్చకుడు వీరయ్య భక్తులకు శివమాలధారణ చేశారు. మాలధారణ వేసే భక్తుల కోసం ఆలయ అధ్యక్షుడు కందూరి సుధాకర్, ఈవో శ్రీనివాసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శివ మాలధారణ అనంతరం స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



మాలధారణ చేస్తున్న శివభక్తులు

మద్యం మత్తులో జెండా ఆవిష్కరణకు యత్నం

›› అధికారిని అడ్డుకున్న గ్రామస్థులు

మహమ్మదాబాద్, జనవరి 26 : మద్యం మత్తులో ఓ ప్రభుత్వ అధికారి జెండాను ఆవిష్కరించేందుకు యత్నించగా గ్రామస్థులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలం నంచర్ల గ్రామంలోని పశువైద్యశాల కార్యాలయంలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ జనార్ధన్ జాతీయ జెండాను ఎగురవేయాల్సి ఉండగా, ఆయన పూటుగా మద్యం తాగి కార్యాలయానికి వచ్చారు. జాతీయ జెండాను ఆవిష్కరించేందుకు యత్నించగా అనుమానం వచ్చిన యువకులు, గ్రామస్థులు అడ్డుకున్నారు. తాగిన మత్తులో ఉన్న డాక్టర్ జనార్ధన్ గ్రామస్థులతో వాగ్వాదానికి దిగారు. 'తనెందుకు జెండా ఆవిష్కరించనివ్వరు.. ఈరోజు సాయంత్రం నేనే జెండా ఆవిష్కరిస్తా.. ఎవరికి ఫిర్యాదు చేస్తారో చేసుకోండి' అంటూ వారితో గొడవ పెట్టుకున్నారు. దీంతో అక్కడున్న వారు డాక్టర్‌కు సర్దిజెప్పి అక్కడ్నుంచి పంపించారు. అనంతరం అటెండర్ చేత జెండాను ఎగురవేయించారు. డాక్టర్ తీరుపై గ్రామస్థులు ఆ శాఖ జేడీకి ఫిర్యాదు చేశారు.

'ఆంధ్రజ్యోతి' యూనిట్ కార్యాలయంపై జెండావిష్కరణ

మహబూబ్‌నగర్, జనవరి 26 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం అప్పన్నపల్లి గ్రామ శివారులోని 'ఆంధ్రజ్యోతి' యూనిట్ కార్యాలయంపై బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎడిషన్ ఇన్‌చార్జి తిరుపతయ్య, అసిస్టెంట్ మేనేజర్ చందు, ఏసీఎం భాస్కర్ రావు, టెక్నికల్ ఇన్‌చార్జి మురళి, సబ్ ఎడిటర్ సాయికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



'ఆంధ్రజ్యోతి' యూనిట్ కార్యాలయంపై జెండావిష్కరణ చేసిన బీఎం

ఫర్టిలైజర్ షాపు తనిఖీ



ఫర్టిలైజర్ షాపులో రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

కోడేరు, జనవరి 26 : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో ఉన్న పలు ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ అధికారి శ్రీరాం శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా షాపులో ఉన్న రసాయనిక ఎరువుల స్టాక్ రిజిస్టర్‌ను, స్టాక్‌ను పరిశీలించారు. షాపులో ఏఏ ఎరువులు విక్రయిస్తున్నారో యజమానులనడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధరల ప్రకారమే రైతులకు ఎరువులను అందించాలన్నారు. ఎరువుల్లో కల్తీవని రుజువైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవో వెంట ఏఈవో మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

అత్యాచార కేసులో నిందితుడి రిమాండ్

ఆత్మకూరు, జనవరి 26 : ఐదేళ్ల చిన్నారిపై అత్యాచార కేసులో 17 ఏళ్ల బాలుడిని వనపర్తి డీఎస్పీ ఆనంద్‌రెడ్డి ఆధ్వర్యంలో రిమాండ్‌కు తరలించినట్లు ఆత్మకూరు ఎస్సై నరేందర్ తెలిపారు. బుధవారం రాత్రి బాలుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం డీఎస్పీ ఆనంద్‌రెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా జోనల్ కోర్టుకు తరలించారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెద్దకొత్తపల్లి, జనవరి 26 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం మరికల్ గ్రామంలో అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పాశం రాజుయాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మరికల్ గ్రామానికి చెందిన భద్రయ్య అనే వ్యక్తి నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా ముష్టిపల్లి గ్రామ సమీపంలో దాడి చేసి పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నాలుగు క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత

అచ్చంపేట టౌన్, జనవరి 26 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ఓ కిరాణం దుకాణంలో సారాకు ఉపయోగించే నల్లబెల్లం, పటికను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సాయి కిరాణం దుకాణాన్ని శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో దుకాణంలో సారాకు ఉపయోగించే నల్లబెల్లం, పటిక పట్టుబడింది. దుకాణ యజమాని సాయిపై కేసు నమోదు చేసి, రూ.50వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. గతంలో సైతం నల్లబెల్లం, పటిక విక్రయిస్తుండగా అతనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

జడ్పీటీసీగానే రాజకీయ గుర్తింపు

›› మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

›› ఎమ్మెల్యేను సన్మానించిన 2014-19 బ్యాచ్ జడ్పీటీసీ సభ్యులు



మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని సత్కరిస్తున్న మాజీ జడ్పీటీసీ సభ్యులు

మహబూబ్‌నగర్, జనవరి 26 : జడ్పీటీసీ సభ్యుడిగా ఉన్నప్పుడే తనకు రాజకీయంగా మంచి గుర్తింపు లభించిందని, అదే ఈరోజు తనను ఎమ్మెల్యే కావడానికి దోహదపడిందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఎమ్మెల్యేను అయిన 2014-19లో తనతో పాటు జడ్పీటీసీగా పని చేసిన సభ్యులందరికీ తాను జడ్పీటీసీ సభ్యుడినేనని, తనను దూరం చేయవద్దని కోరారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో 2014-19లో ఉమ్మడి జిల్లాలో జడ్పీటీసీ సభ్యులుగా పని చేసిన వారంతా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అప్పటి తోటి సభ్యుడిగా మీకు తన నుంచి ఎలాంటి సహాయమైనా చేయడానికి సిద్ధమని, తనను ఎప్పుడైనా సంప్రదించవచ్చని సూచించారు. మీ ప్రేమ, మక్తల్ ప్రజల అభిమానంతోనే సర్పంచ్ స్థాయి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందానని తెలిపారు. ఎప్పటికీ తాను ప్రజల మనిషిగానే ఉంటానని ఇందులో మరో ఆలోచన ఉండబోదన్నారు. మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్ మాట్లాడుతూ తాను చైర్మన్‌గా ఉన్న సమయంలో జడ్పీటీసీ సభ్యుడిగా ఉన్న శ్రీహరి ఎమ్మెల్యే కావడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు రామన్‌గౌడ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, కండె హరిప్రసాద్, పీజే.బాబు, జయప్రద, ధర్మానాయక్, హనుమంతు, వెంకటయ్య, పొన్నకల్ మహమూద్, బస్తీరామ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీలకు పెద్దకొత్తపల్లి విద్యార్థి

›› ఎంపికైన కూర బాలుకు రూ.50 వేలు అందజేసిన ప్రజాప్రతినిధులు



విద్యార్థి కూర బాలుకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్

పెద్దకొత్తపల్లి, జనవరి 26 : నేపాల్‌లోని ఖాట్మండ్‌లో ఫిబ్రవరి నెలలో జరగబోయే జాతీయ స్థాయి కరాటే పోటీలకు పెద్దకొత్తపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఏడవ తరగతి విద్యార్థి కూర బాలు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం మద్దిలేటి తెలిపారు. పేదరికంలో మగ్గుతున్న బాలు కరాటేపై మమకారంతో కఠోరమైన శ్రమ చేస్తూ మార్షల్ ఆర్ట్స్‌లో రాష్ట్ర వ్యాప్తంగా పది గోల్డ్‌మెడల్స్ సాధించాడు. ఎంపికైన బాలును ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, జడ్పీటీసీ సభ్యురాలు మేకల గౌరమ్మ, సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్లురెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దండు నరసింహ, ఎంపీటీసీ సభ్యురాలు శశికళ అభినందించి రూ.50 వేల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. అలాగే, ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం రూ.ఐదు వేల నగదును అందించి, విద్యార్థిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ మెరుగురాజు, డైరెక్టర్ దండు చంద్రయ్య, కాంగ్రెస్ నాయకులు మేకల చంద్రయ్య, శివశంకర్ తదితరులున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తాం

›› మాజీ ఎంపీ డాక్టర్ మంద జగన్నాథ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ డాక్టర్ మంద జగన్నాథ్

కల్వకుర్తి, జనవరి 26 : త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా ఎదిగి 14 స్థానాల కంటే ఎక్కువే గెలుపొందుతుందని నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ డాక్టర్ మంద జగన్నాథ్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలో జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్‌కుమార్, పసుల సుదర్శన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు అశోక్‌రెడ్డిలతో కలిసి డాక్టర్ మంద జగన్నాథ్ శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో మాజీ సీఎం కేసీఆర్ నియంతృత్వ పాలనలో ప్రజలు విసుగు చెందారని పేర్కొన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్, కవిత, ఇతర ఆ పార్టీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలుపరుస్తామని, ఇప్పటికే రెండు హామీలను అమలుపరుస్తున్నట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు సంపూర్ణ మెజార్టీ ఇచ్చారని, బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు తమ పద్ధతి మార్చుకోవాలని, లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో పలువురు నాయకులు ఉన్నారు.

అనారోగ్యంతో మాజీ సైనికుడి మృతి



పీరెడ్డి రాజిరెడ్డి (ఫైల్)

వెల్దండ, జనవరి 26 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కుప్పగండ్ల గ్రామానికి చెందిన మాజీ సైనికుడు పీరెడ్డి రాజిరెడ్డి(45) శుక్రవారం అనారోగ్యానికి గురై ఆకస్మికంగా మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. భారతసైన్యంలో పనిచేసిన రాజిరెడ్డి సుమారు 15 ఏళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేసి స్వగ్రామంలోనే ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో అతని మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో వైద్యం తీసుకుంటున్నట్లు గ్రామస్థులు తెలిపారు. కాగా, శుక్రవారం ఉదయం తన వ్యవసాయ పొలంలో పనిచేస్తూ తీవ్ర ఆయాసంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. చికిత్స నిమిత్తం గ్రామస్థులు తరలించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వ్యక్తిపై దాడి, కేసు నమోదు

ఉప్పునుంతల, జనవరి 26 : భూమి వివాదంలో వ్యక్తిపై దాడి చేసిన సంఘటనలో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై గురుస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రానికి చెందిన మేడమోని లింగమయ్య తండ్రి సత్తయ్యకు ఉప్పునుంతల శివారులోని సర్వేనెంబరు 568, 569లోని ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం సర్వేతో కొలతలు చేయించి హద్దులు పెట్టుకున్నాడు. శుక్రవారం లింగమయ్య తండ్రి సత్తయ్య పొలంలో పని చేసుకుంటున్నాడు. తన పాలి వారు అయిన మేడమోని నిరంజన్ కుమారుడు సాయిబాబు ట్రాక్టర్‌తో సత్తయ్య పొలం గెట్టు దున్నుతుండగా ప్రశ్నించాడు. దీంతో సాయిబాబు నానా బూతులు తిడుతూ తల్లి లక్ష్మమ్మతో కలిసి సత్తయ్యను రాయితో ఛాతి, కడుపు భాగంలో కొట్టి గాయపరిచారు. సత్తయ్య ఫిర్యాదు మేరకు సాయిబాబు, లక్ష్మమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గురుస్వామి తెలిపారు.

పొట్టేళ్ల పందెం



పందెంలో తలపడుతున్న పొట్టేళ్లు

మానవపాడు, జనవరి 26 : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని బోరవెల్లి గ్రామంలో జాతర సందర్భంగా శుక్రవారం అంతరాష్ట్ర పొట్టేళ్ల పందేలను నిర్వహించారు. సర్పంచు విజయ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు శేషిరెడ్డి ప్రశాంతి ఆధ్వర్యంలో పోటీలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే విజయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 16 పొట్టేళ్ల పోటీల్లో పాల్గొన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా పావనపాడుకు చెందిన సునిత వాడాల పొట్టేలు మొదటి బహుమతి రూ.30 వేల నగదును గెలుపొందింది. రెండో బహుమతి రూ.20 వేలను కర్నూల్ జిల్లా గొందిపర్లకు చెందిన ప్రభాస్ పొట్టేలు, మూడో బహుమతి రూ.10 వేలను కర్నూల్ జిల్లా బేతంచర్లకు చెందిన భాష పొట్టేలు గెలుచుకున్నాయి. ఈ పోటీలను తిలకించేందుకు జిల్లాలోని గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలొచ్చారు. కార్యక్రమంలో నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, కరుణసింహారెడ్డి, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్ రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి



మైబు (ఫైల్)

బిజినేపల్లి, జనవరి 26 : చెరువు సమీపంలో గేదెలను మేపుతు ప్రమాదవశాత్తు చెరువులో జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం నంది వడ్డెమాన్ గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి మైబు(33) శుక్రవారం సాయంత్రం రోజులాగే గ్రామ సమీపంలోని రచ్చలకుంట చెరువు చుట్టూ ఉన్న గడ్డిలో గేదెలను మేతకు తీసుకెళ్లాడు. నీటిలోకి వెళ్లిన పశువులను ఆదిలిస్తుండగా ప్రమాదవశాత్తు అతను అదుపు తప్పి నీటిలో పడి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

గుండుబావిలో మృతదేహం లభ్యం



శ్రీనివాసులు (ఫైల్)

వనపర్తి రూరల్, జనవరి 26 : గుండుబావిలో గోనెసంచిలో మృతదేహం లభ్యమైన సంఘటన వనపర్తి జిల్లా పరిధిలోని పెద్దగూడెం శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై నాగన్న తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగూడెం గ్రామ శివారులో గుండు బావిలో గోనె సంచిలో మృతదేహం ఉందని గ్రామ సర్పంచ్ కొండన్న ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి గోనె సంచిలో ఉన్న మృతదేహాన్ని వెలికితీశామన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి గోనెసంచిలో కట్టి బావిలో పడేశారన్నారు. రెండురోజుల క్రితం వనపర్తి పట్టణంలోని లక్ష్మీనరసింహ కాలనీకి చెందిన శారద తన భర్త శ్రీనివాసులు(35) కన్పించడం లేదని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు. అనుమానంతో మృతదేహాన్ని ఫిర్యాదు చేసిన శారదకు చూపించడంతో మృతదేహం శ్రీనివాసులుదేనని గుర్తించారు. మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అగ్ని ప్రమాదంలో కోళ్ల షెడ్ పాక్షికంగా దగ్ధం



పెద్దకొత్తపల్లిలో జరిగిన అగ్ని ప్రమాదంలో పాక్షికంగా దెబ్బతిన్న కోళ్లషెడ్

పెద్దకొత్తపల్లి, జనవరి 26 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన కేతేపల్లి శివకు చెందిన కోళ్లషెడ్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పాక్షికంగా దగ్ధమైంది. బాచారం గ్రామ సమీపంలోని తన వ్యవసాయ పొలంలో ఉన్న కోళ్లషెడ్‌పైన జమ్ము ఉండడంతో జమ్ముకు పెట్రోల్ పోసి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో కోళ్ల దాణా, రేకులు పాక్షికంగా దెబ్బతిన్నట్లు బాధితుడు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు కోళ్లషెడ్‌కు నిప్పంటించడంతో తనకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

ద్విచక్ర వాహనాలు ఢీ, ఒకరి మృతి

›› మరొకరి పరిస్థితి విషమం

›› హైదరాబాద్‌కు తరలింపు

కొత్తకోట, జనవరి 26 : వనపర్తి జిల్లా కొత్తకోట మండలం ముమ్మళపల్లి గ్రామ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి మండలం కడుకుంట్లకు చెందిన వెంకటేశ్వర్లు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జెండా కాగితాలు తీసుకరావడం కోసం మిత్రుడు చందుకుమార్ (19)తో కలిసి ద్విచక్ర వాహనంపై కొత్తకోటకు వస్తుండగా ముమ్మళపల్లి గ్రామ దగ్గరలో రాంగ్ రూట్‌లో వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో చందుకుమార్, వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. చందుకుమార్ అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. వెంకటేశ్వర్లు పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీ, కొడుకు దుర్మరణం

›› మహారాష్ట్రలో ఘటన





రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వసుధ, శ్రీమన్

కొత్తకోట, జనవరి 26 : విహారయాత్ర ఓ కుటుంబాన్ని తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. రోడ్డు ప్రమాదంలో తల్లీ, కొడుకు మృతి చెందిన ఘటన మహారాష్ట్రలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణానికి చెందిన కూరగాయల వ్యాపారి కృష్ణయ్య, భార్య వసుధ(32), వీరి ఇద్దరు పిల్లలు శ్రీమన్(4), మరో ఆరేళ్ల పాపతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం డోన్ పట్టణానికి చెందిన మిత్రుడి కుటుంబ సభ్యులంతా ఓ మినీ వాహనంలో షిరిడీ యాత్రకు బయలుదేరారు. గురువారం సాయంత్రం కొత్తకోట నుంచి బయలుదేరిన వీరు షిరిడీకి 50 కిలో మీటర్ల దూరంలోని ఔరంగబాద్ సమీపంలో మధ్యరాత్రి ముందు వెళ్తున్న వాహనాన్ని వీరి వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో వసుధతో పాటు, ఆమె కుమారుడు శ్రీమన్ అక్కడికక్కడే మృతి చెందారు. కృష్ణయ్యకు సైతం తీవ్ర గాయాలైనట్లు తెలిసింది. ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగారు. కృష్ణయ్య తల్లిదండ్రులు మణెమ్మ, తిరుపతయ్య దంపతులను కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి, సానుభూతి తెలిపారు.

కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వమే

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ట సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ట సుధాకర్

వనపర్తి అర్బన్, జనవరి 26 : కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వమే అధికారం చేపట్టనుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ట సుధాకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ నిర్వహించిన గావ్ చలో అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారై మాట్లాడారు. ప్రతీ గ్రామంలో బూత్ కమిటీని పటిష్టం చేసి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసు కెళ్లాలని సూచించారు. 500 సంవత్సరాలు చరిత్ర కలిగిన రామ మందిరాన్ని పునర్నిర్మించిన నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరిచే విధంగా ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలని వారు అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, బీజేపీ నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రభారి ఎడ్ల అశోక్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు వేముల నరేంద్ర రావు, అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం ఉన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రగతి విద్యార్థిని గాయత్రిని అభినందిస్తున్న ఇన్‌చార్జి డీఈవో, ఎంఈవోలు



నోబుల్ హైస్కూల్ విద్యార్థి కృష్ణవంశీని అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

గద్వాల టౌన్, జనవరి 26 : సైన్స్ ఎగ్జిబిషన్-2023-24కు సంబంధించి జిల్లా స్థాయిలో ఎంపికై రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థులు దక్షిణ భారతస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

స్థానిక విశిష్ట నోబుల్ విద్యార్థి కృష్ణవంశీ ప్రదర్శించిన ఆటోమేటిక్ ఇరిగేషన్ సిస్టమ్ ప్రాజెక్టు నమూనా, ప్రగతి విద్యానికేతన్ విద్యార్థిని గాయత్రి ప్రదర్శించిన ఆరోగ్యం ప్రాజెక్టులు సౌత్ ఇండియన్ సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికయ్యాయి. విద్యార్థులను ఇన్‌చార్జి డీఈవో ఇందిరాదేవి, ఎంఈవో సురేష్, డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి, పాఠశాలల హెడ్‌మాస్టర్లు, కరస్పాండెంట్లు శుక్రవారం అభినందించారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 27వ తేదీన విజయవాడలో నిర్వహించే పోటీల్లో హాజరు కావాల్సి ఉంటుందన్నారు.

జిల్లాకు ఉత్తమ ప్రతిభ అవార్డు



ప్రిన్సిపల్ సెక్రటరీ చేతుల మీదుగా ప్రతిభ అవార్డును అందుకుంటున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయచంద్రమోహన్

వనపర్తి వైద్యవిభాగం, జనవరి 26 : జాతీయ ఆరోగ్య సేవలకు ఉత్తమ ప్రతిభ అవార్డు వరించిందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయచంద్ర మోహన్ తెలిపారు. గురువారం రాత్రి హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరి క్రిస్టినా, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కరుణన్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీంద్రనాయక్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ప్రతిభ అవార్డును అందుకున్నట్లు ఆయన తెలిపారు. లెప్రసీ, హెచ్ఐవీ, టీబీ, ఎన్‌సీడీ, మిషన్ ఇంద్రధనుస్సు వంటి అనేక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జిల్లాకు అవార్డు వరించిందని, ఈ అవార్డు రావడానికి కారణమైన వైద్య, ఆరోగ్యశాఖ అధికారులందరికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ స్థాయికి ఎంపికైన కేకే రెడ్డి పాఠశాల విద్యార్థులు



పాఠశాల అధ్యాపక బృందంతో జాతీయ స్థాయికి ఎంపికైన సాయిసాత్విక్, రోహిత్‌తేజ

తెలకపల్లి, జనవరి 26 : దక్షిణ భారతదేశ శాస్త్ర సాంకేతిక గణిత వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో కేకే రెడ్డి పాఠశాల విద్యార్థులు సాయిసాత్విక్, రోహిత్‌తేజలు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ కే లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను శుక్రవారం పాఠశాల అధ్యాపక బృందం అభినందించారు. ఈ నెల 22న మండల కేంద్రంలోని కేకే.రెడ్డి పాఠశాలలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో చేసిన బహుళార్థ సాధక వ్యవసాయ పరికరం" ప్రయోగంతో ఉత్తమ ప్రతిభ కనబర్చారని తెలిపారు. ఈ విద్యార్థులు దక్షిణ భారతదేశ శాస్త్ర సాంకేతిక గణిత వైజ్ఞానిక ప్రదర్శన పోటీలకు సాయిసాత్విక్, రోహిత్‌తేజలు ఎంపిక కావడంతో పాఠశాల కరస్పాండెంట్ కే.లక్ష్మారెడ్డి, పాఠశాల అకాడమిక్ సలహాదారు డాక్టర్ కే.రఘురాంరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే సతీమణి

అచ్చంపేటఅర్బన్, జనవరి 26: మండల పరిధిలోని రంగాపూర్ నిరంజన్ షావలీ దర్గా ఉర్సులో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ సతీమణి జడ్పీటీసీ సభ్యురాలు అనూరాధ దర్గాను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. దర్గా ముతావలిలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

- ఈ నెల 29న న్యాక్ కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ

- మల్లెలతీర్థం పునరుద్ధరణకు చర్యలు : ఎమ్మెల్యే వంశీకృష్ణ



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

దోమలపెంట, జనవరి 26: ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కొందరి వాడు కాదు అందరి వాడని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు చెట్టు కింది అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వటవర్లపల్లిలో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు మొదటి వార్షికోత్సవానికి ఆయన హాజరయ్యారు. అంతకుముందు గ్రామంలో నెలకొన్న సమస్యలను సర్పంచ్ చత్రునాయక్ ఎమ్మెల్యేకు విన్నవించారు. వటవర్లపల్లిలో ఆసుపత్రి 24 గంటల పాటు వైద్య సేవలు అందించేందుకు జీవో విడుదల చేశామని, తాగునీటి సమస్యకు నూతనంగా సోలార్ ప్లాంట్ ఏర్పాటు, ప్రాథమికోన్నత పాఠశాలకు నూతన భవనం నిర్మాణం, కానుగుల చెరువు అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం, దోమలపెంటలో రూ. 20 లక్షలతో మినీ ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా నల్లమల యువతకు సాంకేతిక విద్యను అందించేందుకు అచ్చంపేటలో రూ.10 కోట్ల నిధులతో న్యాక్ కార్యాలయం నిర్మించేందుకు ఈనెల 29న శంకుస్థాపన చేయనున్నట్లు ఈయన పేర్కొన్నారు. ఓయూ ప్రొఫెసర్ సంఘంరెడ్డి పృథ్వీరాజ్, నాయకులు డాక్టర్ మోపతయ్య, కొయ్యల శ్రీనువాసులు, నిరంజన్ ముదిరాజ్, కాశన్నయాదవ్, ఎంపీపీ శ్రీనువాసులు, ఎంపీటీసీ సభ్యులు మల్లికార్జున్, శ్రీనువాసులు అంబేడ్కర్ సంఘం నాయకులు నాసరయ్య, ఎర్రం శేఖర్, బాబురావు, రాజేష్, మాజీ ఎంపీటీసీ అలువేల, ఉపసర్పంచ్, అనుసూయ, సర్యానాయక్, జూల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలను కొనసాగిద్దాం



జీడిపల్లిలో గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు జూలూరి రమేష్‌బాబు, నాయకులు

కల్వకుర్తి, జనవరి 26 : జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను కొనసాగిద్దామని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ ఉపాధ్యక్షుడు జూలూరి రమేష్‌బాబు అన్నారు. కల్వకుర్తి మండల పరిధిలోని జీడిపల్లి గ్రామంలోవాసవీక్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీజీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. వాసవీక్లబ్ నాయకులు హరికృష్ణ, కలిమిచెర్ల రమేష్, సత్యనారాయణ, శివ, జగదీశ్వర్, గోపాల్, శ్రీనివాసులు, ఆంజనేయులు, అశోక్, సీహెచ్.శ్రీధర్, కృష్ణయ్య, మనోహర్, పాండు, సీఎస్ఎన్.గుప్తా, రాఘవేందర్, కృష్ణయ్య, ఖాజా తదితరులు ఉన్నారు.

పాఠశాలకు కలర్ ప్రింటర్ వితరణ

ఉప్పునుంతల, జనవరి 26: మండల కేంద్రమైన ఉప్పునుంతల జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు 1991-92 పదవ తరగతి బ్యాచ్‌కు సంబంధించిన పూర్వ విద్యార్థులు గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డికి 12 వేల విలువ గల కలర్ ప్రింటర్ అందచేశారు. అదే విధంగా క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు సర్పంచ్ సరిత అందచేశారు. నాయకులు అనంతరెడ్డి, ఉపాధ్యాయులు హనుమంత్‌రెడ్డి, నాగేశ్వరావు, శ్యాంసుందర్‌గౌడ్, పూర్వ విద్యార్థులు నామని తిరుపతయ్య, బుచ్చిరెడ్డి, తిరుపతయ్య, సునిత, కిషన్, సరమేశ్వర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

అందరి సహకారంతోనే ఉత్తమ గ్రామ పంచాయతీ

బిజినేపల్లి, జనవరి 26 : జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా పాలెం పంచాయతీ ఎంపిక కావడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, పంచాయతీ సిబ్బంది సహకారంతోనే సాధ్యమైందని సర్పంచ్ గోవిందు లావణ్యానాగరాజు అన్నారు. గణతంత్ర దినోత్సవాలు పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని పాలెం మేజర్ గ్రామపంచాయతీని జిల్లాలో ఉత్తమ పంచాయతీగా ప్రకటించడంపై ఆమె హర్షం వ్యక్తం చేసి మాట్లాడారు. అంతకు ముందు గ్రామ పంచాయతీ సిబ్బందిని ఉత్తమ విశిష్ట సేవా పురస్కారాలను అందజేసి మెమొంటో, శాలువాలతో సత్కరించారు. ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, నాగరాజు, పంచాయతీ కార్యదర్శి చిన్న బీరయ్య ఉపసర్పంచ్ చికొండ్ర రాములు, ఎంపీటీసీ సభ్యుడు సోములమ్మ, సి.తిరుపతయ్య, ఐల రవీందర్ రెడ్డి, మాడ్గుల స్వామి, అమరేందర్, బత్తుల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఘనంగా గంధోత్సవం



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

పదర, జనవరి 26 : మండలంలోని వంకేశ్వరం గ్రామంలో సైదులుబాబా దర్గా వద్ద గంధోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి భక్తురాలు పుల్లమ్మస్వామి ఇంటి నుంచి విద్యుత్ దీపాలతో అలంకరించిన ప్రభతో పూలు, గంధం, అత్తరు, పన్నీరు తదితర సుగంధ ద్రవ్యాలతో రెండు గుర్రాల మీద గ్రామ పురవీధుల వెంట ఊరేగిస్తూ గ్రామ శివారులో ఉన్న దర్గా వద్దకు తీసుకెళ్లారు. కోలాటాలతో శుక్రవారం ఉదయం 5గంటలకు దర్గా సన్నిధిలో ప్రత్యేక ప్రార్థనల మధ్య ఫతేహా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రీతిపాత్రమైన మలీజా అనే ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మోపతయ్య, జీబీఆర్ ట్రస్టు చైర్మన్ గువ్వల అమల, సింగిల్ విండో చైర్మన్ పోశం గణేష్, పదర ఎంపీపీ బిక్యానాయక్, సర్పంచ్‌లు ప్రేమ్, దశరథంనాయక్ పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు

- ప్రభుత్వ, పార్టీలు, ప్రజా సంఘాల కార్యాలయాల వద్ద జాతీయ పతాకావిష్కరణ



జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద పతాకావిష్కరణ చేస్తున్న శాంతకుమారి



బీఆర్ఎస్ కార్యాలయం వద్ద పతాకావిష్కరణ చేస్తున్న బాలరాజు



పతాకావిష్కరణ చేస్తున్న ఎల్లేని సుధాకర్‌రావు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 26: జిల్లా కేంద్రంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద చైర్‌పర్సన్ శాంతకుమారి జాతీయ పతాకావిష్కరణ చేశారు. అదేవిధంగా మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్ యాదయ్య, ఆర్డీవో రాంరెడ్డి, ఎంపీడీవో కోటేశ్వర్, తహసీల్దార్ సుధాకర్ జాతీయ పతాకావిష్కరణ చేశారు. టీఎస్ఆర్టీసీ డిపోలో మేనేజరు దేవరాజ్ జెండావిష్కరణ చేశారు.

● **రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో..**

జిల్లా కేంద్రంలో పలు పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించాయి. నాయకులు, ప్రజా ప్రతినిధులు,సంఘాల నాయకులు జాతీయ పతాకావిష్కరణ చేశారు. డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి, కౌన్సిలర్లు కావలి శ్రీనివాసులు, ఎండీ.నిజాముద్దీన్, సునేంద్ర, సుల్తాన్, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు జాతీయ పతాకావిష్కరణ చేశారు. జడ్పీ చైర్ పర్సన్ శాంతకుమారి, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు జాతీయ పతాకావిష్కరణ చేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, అధికార ప్రతినిధి దిలీప్‌చారి, బీజేపీ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు. మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ నాగం శశీధర్‌రెడ్డి జాతీయ పతాకావిష్కరణ చేశారు. బీఆర్ఎస్ నాయకులు అర్థం రవి, తిమ్మాజిపేట పాండు, మోతీకు మార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● **ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..**

విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జె.రాంచంద్రారెడ్డి జాతీయ పతాకావిష్కరణ చేశారు. జిల్లా కార్యదర్శి శ్రీధర్, నాయకులు బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, వార్డెన్ చెన్నయ్య, వెంకటశెట్టి, బాలస్వామి, ప్రభాకర్, దొడ్ల నారాయణరెడ్డి, అనురాధ, శ్రీనివాసులు, వేణుగోపాల్, కళాధర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, నాయకులు రవీందర్‌గౌడ్, నేష లక్ష్మయ్య, మూలింటి వెంకటేశ్వర్లు, కొట్ర శ్రీనివాసులు, గంగోజీ, నిరంజన్‌యాదవ్, సదుర్ల తిరుపతయ్య, సుధాకర్‌గౌడ్, జంపుల తిరుపతయ్య, పబ్బతి శ్రీనివాసులు, మంగళి నిరంజన్, కాళ్ల చైతన్య తదితరులు జెండా పండుగలో పాల్గొన్నారు. పట్టణ హమాలీ సంఘం ఆధ్వర్యంలో గాంధీపార్కు వద్ద ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య, హమాలీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

● అచ్చంపేట : గణతంత్ర వేడుకలు శుక్రవారం అచ్చంపేట నియోజకవర్గంలో ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల్లో అధికారులు తీవర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డాక్టర్ వంశీకృష్ణ జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. పట్టణంలో ఆర్డీవో గోపిరామ్, డీఎస్పీ కృష్ణకిషోర్, డీఎఫ్‌వో, తహసీల్దార్ పాండు, వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హేమలత, విద్యుత్ శాఖ ఏఈ ఆంజనేయులు, మునిసిపల్ చైర్మన్ నర్సింహగౌడ్‌తో పాటు ఉపాధ్యాయులు జాతీయ జెండాను ఎగరవేశారు.

● ఉప్పునుంతల: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన ఉప్పునుంతలతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తబితారాణి, ఏఈవో, ఎంపీడీవో లక్ష్మణ్‌రావు, ఎంపీపీ అరుణ, సింగిల్‌విండో చైర్మన్ భూపాల్ రావు, వైద్యాధికారి నరేందర్, ఎస్సై గురుస్వామి, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

● పెద్దకొత్తపల్లి: మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలతో గ్రామంలోని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి జాతీయ నాయకులకు జేజేలు పలికారు. తహసీల్దార్ యూసుఫ్‌అలీ, ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్, ఎస్ఐ పాశం రాజుయాదవ్, సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయ్‌కుమార్, ఉన్నత పాఠశాల హెచ్ఎం మద్దిలేటిలు జాతీయ జెండాను ఎగురవేశారు. జడ్పీటీసీ సభ్యురాలు మేకల గౌరమ్మ, ఎంపీడీవో కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి నాగశేషి, ఎంపీటీసీ సభ్యులు రవికుమార్, శశికళ తదితరులు పాల్గొన్నారు.

● తెలకపల్లి: తహసీల్దార్ మురళీమోహన్, ఎంపీడీవో బాస్కర్, ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డి, తెలకపల్లి సర్పంచ్ సురేఖ జాతీయ జెండాను ఎగురవేశారు.

● బిజినేపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ, పీఏసీఎస్, ఐకేపీ, ఎంఈవో, ఏవో, పోలీసు స్టేషన్, పశుసంవర్ధక శాఖలకార్యాలయాలతో పాటు కేవీకే, ఆర్ఏఆర్ఎస్, ప్రాథమిక వైద్య కేంద్రాలు, జవహర్ నవోదయ విద్యాలయం, ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, యువజన, మహిళ సంఘాల భవనాల్లో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని త్రివర్ణ పతాకాన్ని అధికారులు ఘనంగా ఆవిష్కరించారు. తహసీల్దార్ జనుంపల్లి శ్రీరాములు, ఎంపీడీవో కృష్ణయ్య, ఎంపీవో రాములునాయక్, ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బాల్‌రాజుగౌడ్, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు మంగి విజయ్, ఎస్సై రాములు, వైస్ ఎంపీపీ చిన్నారెడ్డి, ఏవో నీతి, ఏపీఎం రజిత, ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి, కేవీకే కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి, నవోదయ ప్రిన్సిపాల్ భాస్కర్ కుమార్, సర్పంచ్‌లు లావణ్య నాగరాజు, క్యామ బాలీశ్వర్, లక్ష్మి, అవంతి, అమృత్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, చంద్రకళ, జి.శేఖర్‌రెడ్డి, మహేష్‌రావు, మాధవి, రంగమ్మ, పాండునాయక్, అంజి, లింబియానాయక్, నాయకులు అనిల్‌గౌడ్, గంగనమోని రాములు, మధు, వెంకటేష్‌గౌడ్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

● పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్, మంచాలకట్ట, కొండూరు, గోప్లాపూర్, మల్లేశ్వరం తదితర గ్రామాల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెంట్లవెల్లి తహసీల్దార్ హిమబిందు, ఎంపీడీవో రామయ్య జెండాను ఎగురవేశారు. సర్పంచ్ సువర్ణమ్మ, రాము లుగౌడ్, ఎర్రశ్రీను, కుమార్, ఖాజామైనోద్దీన్, కబీర్ పాల్గొన్నారు.

● తిమ్మాజిపేట: గణతంత్ర వేడుకలు శుక్రవారం తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలపై తహసీల్దార్ జేకే.మోహన్, ఎంపీడీవో కరుణశ్రీలు త్రివర్ణ పతాకాలు ఎగురవేశారు. సింగిల్ విండో ఉపాధ్యక్షుడు రాందేవ్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాసులు, పశువైద్యాధికారిణి శ్రావణి, వైద్యాధికారిణి స్వప్నలు జాతీయ జెండాలను ఎగురవేశారు. గ్రామపంచాయతీ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కార్యాలయాల ముందు అదేవిధంగా జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో సర్పంచ్ వేణుగోపాల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు జోగు ప్రదీప్, బీజేపీ అధ్యక్షుడు యశ్వంత్, జీహెచ్ఎం సత్యనారాయణశెట్టి త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించారు. ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఆయా పార్టీల నాయకులు శ్రీనివాస్ బహదూర్, మల్లయ్యగౌడ్, దానం బాలరాజు, ఉస్మాన్, మాధవులు, సురేందర్‌రెడ్డి, నాగసాయిలు, వివేక్‌రెడ్డి, దేవస్వామి, స్వామి పాల్గొన్నారు.

● తాడూరు: గణతంత్ర వేడుకల్లో తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీవో గంగామోహన్, ఎస్ఐ మహేష్ జెండాలను ఎగురవేశారు. భలాన్‌పల్లి గ్రామానికి చెందిన జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని రాధిక వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో డీఈవో గోవిందరాజులు చేతలు మీదుగా ప్రశంసా పత్రం అందజేశారు. ఎంపీపీ శ్రీదేవి, వైస్ ఎంపీపీ శివలీల, సింగిల్ విండో చైర్మన్ సమద్‌పాష, ఏపీఎం శేఖర్, ఏపీవో ప్రవీణ్ కుమార్, అన్ని గ్రామాలల్లోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

● కోడేరు: మండల కేంద్రంతో పాటు గ్రామాగ్రామాన వాడవాడ, గల్లీగల్లీలో రెపరెపలాడిన మువ్వన్నెల జాతీయ జెండా శుక్రవారం ఉదయమే విద్యార్థుల ప్రభాత భేరీతో ప్రారంభమై పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి స్వతంత్ర సమరయోధుల వేషధారణతో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. సింగిల్ విండో డైరెక్టర్ ఎం.జగన్మోహన్‌రెడ్డి మాట్లాడారు. తహసీల్దార్ సైదులు, ఎస్ఐ వి.శేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ప్రధానోపాధ్యాయులు జెండా ఆవిష్కరించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

● వెల్దండ: గణతంత్ర వేడుకలు మండలంలోని అన్నిగ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీ కార్యాలయాలు, పాఠశాలలు, గ్రామపంచాయతీలు, స్వచ్ఛందసంస్థల ఆధ్వర్యంలో జాతీయ జెండాలను ఎగురవేశారు. తహసీల్దార్ రవికుమార్, సీఐ సోమనర్సయ్య, ఎంపీపీ విజయ, పీఏసీఎస్ చైర్మన్ భాస్కర్‌రావు, ఏవో మంజుల, ట్రాన్స్‌కో ఏఈ సూర్యం, రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, పాలసేకరణ కేంద్రం అధ్యక్షుడు యాఖూబ్, డాక్టర్ స్వరూప, డాక్టర్ శ్యాంసుందర్‌లు ఆయా కార్యాలయాల వద్ద జాతీయజెండాలను ఎగరవేశారు. సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, పీఏసీఎస్ వైఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, డైరెక్టర్లు మట్ట వెంకటయ్యగౌడ్, సంజీవ్‌కుమార్, ఆర్యవైశ్యసంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

● దోమలపెంట: నల్లమలలో గణతంత్ర వేడుకలను శుక్రవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వటవర్లపల్లి, దోమలపెంట, ఈగలపెంట, పాతాళగంగ, సార్లపల్లి, కుడిచింతలబావి గ్రామాల్లో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు కార్యాలయాలు, బ్యాంకులు, జెన్‌కో కార్యాలయం, జల విద్యుత్ కేంద్రం తదితర కార్యాలయాల ముందు జాతీయ జెండాను ఎగుర వేశారు. వటవర్లపల్లిలో సర్పంచ్ చత్రునాయక్ ఆధ్వర్యంలో వార్డు సభ్యులకు, గ్రామ పంచాయతీ సిబ్బందికి శాలువాలు కప్పి జ్ఞాపికను అందజేశారు.


● ఊర్కొండ: మండల కేంద్రంతో పాటు పరిధిలోని గ్రామాల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలపై జాతీయ జెండాను ఎగురవేశారు. తహసీల్దార్ చెన్నకిష్టన్న, ఎంపీపీ బక్క రాధ, ఎస్సై లెనిన్, నేతాజీ విగ్రహం వద్ద మ్యాకల శ్రీనివాసులు, నేతాజీ యువజన సంఘం కార్యాలయంపై అభిషేక్ జాతీయ జెండాను ఎగురవేశారు.

● వంగూరు: వంగూరులో ఎంపీపీ భీమమ్మ, తహసీల్దార్ కిరణ్మాయి, ఎస్ఐ కురుమూర్తితో పాటు ఆయా కార్యాలయాలపై అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు జాతీయ జెండాను ఎగుర వేశారు.

● చారకొండ: మండలంలో గణతంత్ర వేడుకలను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, గ్రామపంచాయతీలు, అంగన్‌వాడీ సెంటర్లలో ఘనంగా జరుపుకొన్నారు. సర్పంచ్ గుండె విజేందర్‌గౌడ్, ఎంపీపీ గుండె నిర్మల, తహసీల్దార్ కేసీ ప్రమీల, పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్, ఎస్ఐ రవి, మండల వ్యవసాయశాఖ అధికారి చిన్నహుసేన్‌యాదవ్, మండల వైద్యాధికారిణి మంజుభార్గవి, మండల పశువైద్యాధికారి శివకుమార్, అంగన్‌వాడీ టీచర్లు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న తల్లిదండ్రులు లేని విద్యార్థులు, పేద విద్యార్థుల చదువులకోసం సర్పంచ్ గుండె విజేందర్‌గౌడ్ పాఠశాల ట్రస్టుకు రూ. ఒక లక్ష, గ్రామానికి చెందిన కేశమోని మధుగౌడ్ రూ. 20 వేలు, రాచమళ్ల చంద్రశేఖర్ రూ. 10 వేలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రాజేందర్‌రెడ్డి, రూ. 10వేలు, జంగునాయక్ రూ. 10 వేలు, సుందర్ రూ. 10 వేలు అందజేశారు. ఎంపీడీవో వెంకటేష్, నాయబ్ తహసీల్దార్ విద్యాధరిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మంజుల, ఉపసర్పంచ్ రాణి నరేందర్‌రెడ్డి, చారకొండ ఎంపీటీసీ-2 గ్యార లక్ష్మణ్, ఆర్ఐలు నబి, రామకృష్ణ, రైతుబంధు మండల అధ్యక్షుడు గజ్జె యాదయ్యగౌడ్, వ్యాయమ ఉపాధ్యాయుడు పి. అంజయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● అమ్రాబాద్: అమ్రాబాద్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం గణతంత్ర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో రామ్మోహన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మదన్మోహన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, అధికారులు జాతీయ జెండాను ఎగరవేశారు.

రాజ్యాంగ స్ఫూర్తితో రాష్ట్రంలో పాలన



గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి: రాష్ట్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. కల్వకుర్తి పట్టణంలో గణతంత్ర వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, ఇందిరానగర్, తిలక్‌నగర్, గాంధీ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ ఎద్మ సత్యం సమక్షంలో కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఆర్డీవో ఎస్.శ్రీను, తహసీల్దార్ ఇబ్రహీం, డీఎస్పీ పార్థసారథిగౌడ్, పీఆర్ డిప్యూటీ ఈఈ దుర్గాప్రసాద్, ఎంపీడీవో ఆంజనేయులు, వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ భగవంతు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శివరాం, పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో, కార్యాలయాల్లో జాతీయ జెండాల ఆవిష్కరణ చేశారు. మునిసిపల్ వైస్ చైర్మన్ షాహెద్, జడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్‌లు బ్బంగి ఆనంద్‌కుమార్, పసుల సుదర్శన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు అశోక్‌రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ రాచోటి శ్రీశైలం, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, షానవాజ్‌ఖాన్,జమ్ముల శ్రీకాంత్, సంతు, వెంకటేష్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. అలాగే, కల్వకుర్తి పట్టణంలోని వాసవీక్లబ్, లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. రమేష్‌బాబు జాతీయ జెండాను ఎగురవేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కలిమిచెర్ల రమేష్, కార్యదర్శి సీహెచ్.శ్రీధర్‌లు జెండా ఆవిష్కరణ చేశారు. కల్వకుర్తి బస్టాండ్ సమీపంలో ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. కల్వకుర్తి పట్టణంలోని పీబీఎస్ వృద్ధాశ్రమంలో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నిర్వాహకుడు పి.వెంకటయ్య వృద్ధులతో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు.

సంక్షేమ పథకాలు అర్హులకు చేరాలి



కలెక్టరేట్ వద్ద జాతీయ పతాకావిష్కరణ చేస్తున్న అదనపు కలెక్టర్ కుమార్ దీపక్

నాగర్‌కర్నూల్ టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన అర్హులైన ప్రజలందరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సమీకృత కలెక్టరేట్ ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద నిర్వహించిన గణతంత్ర వేడుకలకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ హాజరై జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అమలు చేయడంతో పాటు అభివృద్ధికి తమ శాఖల వారిగా తోడ్పాటు అందించాలని అధికారులను కోరారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో..



యాస్మిన్‌బేగంను సన్మానిస్తున్న సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, ఎంపీటీసీ మంజుల

కొల్లాపూర్: గణతంత్ర వేడుకలను కొల్లాపూర్ పట్టణంలో, మండల పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల ముందు, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలు, వాణిజ్య సంస్థలు, రాజకీయ పార్టీల కార్యాలయాల ముందు మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించి గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొల్లాపూర్ మండల కేంద్రంలో ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఆర్డీవో నాగరాజు మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు. జూనియర్ ప్రధాన సివిల్ న్యాయాధికారి ఆర్‌వీఎస్ఎస్.మిథున్‌తేజ, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి జ్యోత్స్నగుంటి జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్ శ్రీకాంత్, సీఐ యాలాద్రి, ఎంపీడీవో చెన్నమ్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

● **మండల పరిధిలోని ...**

కొల్లాపూర్ మండల పరిధిలోని ఎల్లూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు రజియా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గ్రామంలో స్వాతంత్ర సమరయోధుల వేషధారణలో ర్యాలీ నిర్వహించి గ్రామస్థులను ఆకట్టుకున్నారు. సర్పంచ్ బండి లక్ష్మీదేవమ్మ, ఎంపీటీసీ మంజుల, గ్రామ వార్డు సభ్యులు పాల్గొని పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు యాస్మిన్‌బేగంను, ఇతర ఉపాధ్యాయులను శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు.

● **జూపల్లి కార్యాలయం ముందు...**

గణతంత్ర వేడుకల్లో భాగంగా మంత్రి జూపల్లి కృష్ణారావు కార్యాలయం ముందు మండల జడ్పీటీసీ జూపల్లి భాగ్యమ్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొల్లాపూర్ మునిసిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ మహెముదాబేగం, మునిసిపల్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని బీఆర్.అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద మండల అధ్యక్షుడు ముచ్చర్ల రాంచందర్‌యాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ప్రతిభకు పురస్కారాలు

- అవార్డులు అందజేసిన కలెక్టర్

- అందుకున్న 137 మంది ఉద్యోగులు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 26: భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా విశిష్ట సేవలకు గుర్తింపుగా వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ చేతుల మీదుగా జిల్లాలోని వివిధ శాఖల జిల్లా, మండల, క్షేత్ర స్థాయి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పురస్కారాలు అదుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 137 మంది ఉద్యోగులకు అవార్డులు అందజేయగా వారిలో జిల్లా స్థాయిలో ఎనిమిది మంది ఉన్నతాధికారులు అవార్డులు అందుకున్నారు.



కలెక్టర్ ఉదయ్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జిల్లా రెవెన్యూ కలెక్టర్ కె.సీతారామారావు



పత్యానాయక్, జిల్లా కోఆపరేటీవ్ అధికారి, నాగర్‌కర్నూల్



బి.ఉష, జడ్పీ సీఈవో



నర్సింగరావు, గ్రామీణాభిశాఖ అధికారి



భూపాల్‌రెడ్డి, ముఖ్య ప్రణాళిక అధికారి



రమాదేవి, భూగర్భ జలశాఖ అధికారి



కమలాకర్‌రెడ్డి, గిరిజన సంక్షేమ అధికారి



శ్రీధర్‌జీ, జిల్లా బీసీ సంక్షేమ అధికారి



చంద్రశేఖర్, కలెక్టరేట్ పరిపాలనాధికారి



జాకీర్ అలీ, కలెక్టరేట్ సూపరింటెండెంట్,



రాంరెడ్డి, ఆర్డీవో, నాగర్‌కర్నూల్



తిరుపతయ్య, కలెక్టర్ గన్‌మెన్



రామేశ్వర్, అదనపు ఎస్పీ



మోహన్‌కుమార్, డీఎస్పీ, నాగర్‌కర్నూల్



విష్ణువర్దన్‌రెడ్డి, సీఐ, నాగర్‌కర్నూల్



ఖాజామైనోద్దీన్, ఏఎస్ఐ, నాగర్‌కర్నూల్